'హస్తం'లో స్తబ్దత



అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను తేల్చక పార్టీ శ్రేణుల్లో అసహనం వ్యక్తమవుతోంది. నెల రోజుల ముందుగానే అధికార పార్టీ అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో దూసుకెళ్తున్నా.. హస్తం నుంచి ఎవరు పోటీలో ఉంటారో తెలియక గందరగోళం నెలకొంది. దీంతో ప్రజల్లో ఉన్న సానుకూల వాతావరణం కోల్పోవాల్సి వస్తుందని పార్టీ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

- చేవెళ్ల టికెట్ వేటలో నేతలు
- ఢిల్లీ బాట పట్టిన ఆశావహులు
- కేడర్‌ను సమన్వయం చేసే నాయకుడు కరువు

చేవెళ్ల: ఎన్నికల షెడ్యూల్ ముందు వరకు నియోజకర్గంలో కాంగ్రెస్ శ్రేణులు జోరుమీద కనిపించాయి. టికెట్ ఆశావహులు హస్తానే అధికారం అన్నంత హడావుడి చేసి గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని ప్రకటించారు. కానీ సీడబ్ల్యూసీ కమిటీ సమావేశాలు, టికెట్‌ల చర్చల అనంతరం పార్టీ నాయకులు నిశబ్దం చోటు చేసుకుంది. స్థానికులకే టికెట్ కేటాయించాలంటూ లోకల్ లీడర్లు కోరుతున్నా.. నియోజకవర్గం నుంచి బయటి వ్యక్తులను లేదా పార్టీలోని పెద్దవారిని దించుతారనే ఊహాగానాలు సాగుతున్నాయి. దీంతో ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కేడర్‌కు నాయకుడు కరువయ్యాడు. నియోజకవర్గంలో పార్టీకి మంచి ఓటు బ్యాంక్ ఉందనే విషయాలు గత ఎన్నికల ఫలితాలను చూస్తే తెలుస్తోంది. దీన్ని ఉపయోగించుకోవటంలోనే నేతలు విఫలమవుతున్నారు. కింది స్థాయి కేడర్ పార్టీకి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా వారు ఎవరి వెంట వెళ్లాలో తెలియక మౌనంగా ఉండిపోతున్నారరు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. కానీ పార్టీ నిర్ణయంలో స్పష్టత లేక కేడర్ అయోమయంలో పడుతోంది.

టికెట్ వేటకు.. ఢిల్లీబాట

చేవెళ్ల టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా ఢిల్లీ బాట పడుతున్నారు. తమకు టికెట్ కేటాయించాలని తెలిసినవారితో పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో కేడర్‌ను నడిపించే నాయకుడు లేక పార్టీ నిద్రావస్థలో పడింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ప్రచారాలు కరువయ్యాయి. ఎన్నికల కోడ్ వచ్చినా పార్టీలో ఉత్సహం కరువయింది. ఇలాగే ఉంటే ఎన్నికల్లో నియోజకవర్గం ఎవరి 'హస్త'గతమనే ప్రచారం సాగుతోంది.

'చేయి'ఎవరికో..?

నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్ స్థానం కావడంతో సిట్టింగ్ అభ్యర్థులు లేక కాంగ్రెస్‌కు అభ్యర్థి ఎంపిక సమస్యగా మారింది. చేవెళ్లకు చెందిన సున్నపు వసంతం, షాబాద్‌కు చెందిన పామెన భీంభరత్, మొయినాబాద్ మండలం నుంచి షాబాద్ దర్శన్, శంషాబాద్‌కు చెందిన రాచమల్ల సిద్ధేశ్వర్ టికెట్ ఆశిస్తున్నారు. అయితే స్థానిక నేతలు టికెట్‌ను తమకే ఇవ్వాలని స్థానికుల్లో ఎవరికి ఇచ్చినా గెలుపునకు శ్రమిస్తామంటూ ప్రచారం చేసుకుంటూ వచ్చారు. నియోజకవర్గంలో పార్టీకి ఆది నుంచి బలమైన కేడర్ ఉంది. దీంతో ఇక్కడ ఎవరినైనా పెద్ద నేతలను పోటీ చేయించాలనే ఆలోచనలో పార్టీ అధిష్టానం యోచిస్తోందని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మళ్లీ కాంగ్రెస్ టికెట్ కేటాయిస్తే హస్తం గూటికి చేరుతారనే ప్రచారం సాగుతోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిన ఆయన గులాబీ గూటికి చేరారు. చేవెళ్లలో కాంగ్రెస్ టికెట్ రేసులో ఓ మాజీ ఎంపీ, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే స్థాయి నాయకులే చేవెళ్ల బరిలో పోటీలో ఉండబోతున్నారని అనే ప్రచారం సైతం ఉంది. పార్టీ అధిష్టానం టికెట్ ఎవరికి కేటాయిస్తుందో చూడాలి.

క్లుప్తంగా

రేపు జయశంకర్ సార్ విగ్రహావిష్కరణ

చేవెళ్ల: మండలకేంద్రంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వకర్మ సంఘం నాయకులు లింగాచారి, శంభులింగం, ఆనంద్, శ్రీనివాస్‌చారి వెల్లడించారు. మంగళవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులు, ముఖ్యనాయకులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఉదయం 11.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మంత్రులు సబితారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు హాజరవుతారని చెప్పారు. జిల్లా, నియోజకవర్గంలోని పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రైతులకు కూరగాయ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వెల్స్‌పన్ ఫౌండేషన్ సభ్యులు

షాబాద్: పేద రైతులకు కూరగాయ విత్తనాల పంపిణీ చేస్తున్నట్లు వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, మేనేజర్ బద్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెల్లిలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డితో కలిసి 35 మంది రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కూరగాయలను ఎరువులు లేకుండా సేంద్రియ పద్ధతుల్లో పెంచాలని సూచించారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



అంజయ్య యాదవ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పాటిగడ్డ గ్రామస్తులు

కేశంపేట: బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చిత్రపటానికి గ్రామస్తులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పాటిగడ్డ వాగును దాటేందుకు ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు ఎమ్మెల్యే రూ.5.60 కోట్ల నిధులు మంజూరు చేయించారు. సర్పంచ్ మిటిలమ్మ, చిన్నమ్మ, ధన్‌రాజ్‌రెడ్డి, శేఖర్, జంగయ్య, శోభ, మనోహర్ రెడ్డి, వెంకటయ్య, కృష్ణయ్య, జలేందర్, కమలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి కారును గెలిపించుకుందాం

జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్

మొయినాబాద్‌రూరల్: ఈ ఎన్నికల్లోనూ ముచ్చటగా మూడోసారి కారు గుర్తుకు ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జీవంత్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంగళారంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి పార్టీ పథకాలను వివరిస్తూ ఓటేయాలని కోరారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఎమ్మెల్యే కాలె యాదయ్య గెలుపునకు సహకరిస్తాయన్నారు. చిన్నమంగళారం సర్పంచ్ సుకన్యగౌడ్, ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు విష్ణుగౌడ్, పరమేశ్, రావూఫ్, నర్సింహగౌడ్, రత్నం పాల్గొన్నారు.

13 రోజులకు చేరిన సమ్మె



సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కేశంపేట: తమకు కనీస వేతనం అందించాలని కోరుతూ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె మంగళవారంతో 13రోజులకు చేరింది. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సావిత్రి, సత్యమ్మ, లలిత, వెంకటమ్మ, అక్కమ్మ, కళావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీతో సమన్యాయం

పార్టీ అభ్యర్థి భిక్షపతి మహరాజ్

కొందుర్గు: కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ధర్మ సమాజ్ పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి భిక్షపతి మహరాజ్ ఆధ్వర్యంలో జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభించి లచ్చంపేట, లాలాపేట, చిన్న ఉమ్మెంత్యాల గ్రామం మీదుగా ముట్పూర్ గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. డీఎస్పీ అధికారంలోకి వస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. అందరూ ఆదరించి ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రవీందర్, గిరి, శ్రీను, రామస్వామి, నరసింహా, రాములు, శ్రీకాంత్, సిద్ధు, గోపాల్, విజయ్, రాజ, అశోక్ పాల్గొన్నారు.

మహనీయుల కృషి ఆదర్శనీయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: సమాజమార్పునకు మహనీయుల కృషి మరువలేనిదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని రేగడిఘనాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేడ్కర్ వ్యక్తి కాదు.. శక్తి అన్నారు. ఆయన భిక్ష వల్లే ఈ రోజు మేము మీ ముందుక మాట్లాడగలుగుతున్నాం అన్నారు. దేశంలో హరిత విప్లవం, వ్యవసాయాన్ని ఆధునికీకరించడంలో బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సహకారం అనితర సాధ్యమైనవి అన్నారు. వారి చరిత్రలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కళాకారుల బృందం ఆటపాటలతో అలరించారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు సహకరించిన దాతలు మాజీ సర్పంచ్ రాంరెడ్డి, అంబేడ్కర్ సంఘం నాయకుడు రాంబాబు, కాంగ్రెస్ నేత పామెన భీంభరత్ తదితరులకు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.నర్సింలు, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ పి.నారాయణ, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మార్కెట్‌కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు సున్నపు వసంతం, పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు తిప్పని వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ఉప సర్పంచ్ బాల్‌రెడ్డి, అంబేద్కర్‌సంఘం నాయకులు రాంబాబు, రాములు, అలిండియా అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, సర్పంచ్‌లు వెంకటేశంగుప్తా, నరహరిరెడ్డి, నాయకులు గిరధర్‌రెడ్డి, ప్రభాకర్, యాదిరెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, నర్సింలు, శ్యాం, జంగయ్య, నాగార్జున్‌రెడ్డి, కృష్ణ, చంద్రశేఖర్, మద్దెల శ్రీనివాస్, సుశాంత్ పాల్గొన్నారు.



మహనీయుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

శ్రీశైల పీఠాధిపతి కల్యానంద స్వామీజీ



మాట్లాడుతున్న కల్యానంద స్వామీజీ

షాద్‌నగర్‌రూరల్: ప్రతీ ఒక్కరు హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని శ్రీశైల పీఠాధిపతి, సన్యాసి సంఘం అధ్యక్షుడు కల్యానంద స్వామీజీ అన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా గద్వాల జోగులాంబ జిల్లాలోని అలంపూర్ జోగులాంబ ఆలయ నుంచి ప్రారంభమైన రథయాత్ర మంగళవారం పట్టణానికి చేరుకుందిజ ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు, బీజేపీ శ్రేణులు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు. చౌడమ్మ గుట్ట హనుమాన్ ఆలయం నుంచి జీహెచ్‌ఆర్ మైదానం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలువురు పీఠాధిపతులు మాట్లాడుతూ.. మన సంస్కృతి సాంప్రదాయాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణకు, మహిళల రక్షణకు ఛత్రపతి శివాజీ మహరాజ్ ఎంతో కృషి చేశారన్నారు. శివాజీ పోరాటం మనకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నేతలు బండారు రమేశ్, నాగిళ్ల ప్రభాకర్, చెట్ల వెంకటేశ్, బీజేపీ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కృషి ఉంటే విజయాలు వెన్నంటే



ఉద్యోగాలను సాధించిన వారిని అభినందిస్తున్న డీసీపీ

శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సాధించాలనే కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అన్నారు. యువసైనిక్ డిఫెన్స్ అకాడమీ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు పోలీసు, ఆర్మీ ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం ఏసీపీ కార్యాలయంలో డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎదగాలనే ఆలోచనతో ముందుకు సాగాలని అన్నారు. నిబద్ధతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం కోచ్ గిరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ రంగస్వామి, టీజేఏఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- కుటుంబపాలనకు చరమగీతం
- పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఉదయమోహన్‌రెడ్డి

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం శంకర్‌పల్లిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబపాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. చేవెళ్ల నియోజకర్గంలోని శంకర్‌పల్లిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించి స్థానికులకు కేటాయించకుండా నగరానికి చెందిన వారికి కేటాయించడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికల్లో నియోజకవర్గం ప్రజలను ఏ విధంగా ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాశ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రవిందర్ రెడ్డి, నాయకులు రాజుగౌడ్, దేవ్‌లానాయక్, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, శశికాంత్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ సేవలు మరువలేనివి



నారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప

షాద్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నారాయణ చేసిన సేవలు మరువలేనివని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటప్ప అన్నారు. సంఘం దివంగత నాయకుడు నారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎమ్మార్సీ భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ.. ధైర్యం, పట్టుదల కలిగిన నారాయణ యూటీఎఫ్ ఉద్యమాలలో చురుకైన పాత్రను పోషించారని గుర్తు చేశారు. ఆయన జీవితం భావి తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నర్సింలు, కృష్ణయ్య, శేఖర్‌గౌడ్, బాలయ్య, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లుగౌడ్, శ్రీనివాస్, శివరాములు, సురేందర్, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై నజర్

- ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



షాబాద్: ఇటీవల సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. పెరిగిన టెక్నాలజీని వినియోగించుకుని అనేక మంది సైబర్ నేరగాళ్లు ప్రజలను దోచుకుంటున్నారు. దీంతో పోలీసులు సైబర్ నేరాలపై దష్టి సారించారు. ప్రజలు వారి వలలో పడకుండా పోలీసులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. సెల్‌ఫోన్, వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో వచ్చే అనవసరమైన లింకులు క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలపై వివరిస్తున్నారు. అపరిచిత వ్యక్తులతో ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో చాటింగ్, కాల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

బ్యాంకు నుంచి చేస్తున్నాం

సైబర్ నేరగాళ్లు ప్రజలను సులువుగా దోచేస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పంథాలో బురిడీ కొట్టిస్తున్నారు. నిరక్షరాస్యుల నుంచి విద్యావంతుల వరకు అందరి దగ్గర నుంచి డబ్బు లాగేస్తున్నారు. మేము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం.. మీఆధార్ నంబరు చెప్పండి.. మీ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పండి.. మీ ఏటీఎం ఓకే చేయండి.. అంటూ వివిధ రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు.

1930 టోల్ ఫ్రీ నంబర్

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలే కాకుండా ట్రాఫిక్ నియమాలు, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దహెగాం పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పల్లెల్లో ప్రజలకు ప్రతీరోజు అవగాహన కల్పిస్తున్నారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలు, ధరించకుంటే కలిగే ప్రమాదాల గురించి వాహనదారులకు తెలియజేస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు వెంటనే 1930 నంబరుకు కాల్ చేసి ఎన్‌సీఆర్‌పీలో వివరాలు అప్‌లోడ్ చేస్తే 24 గంటల్లోనే అమౌంట్ రిటన్ వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు వివరిస్తున్నారు. సైబర్ నేరానికి గురైన వారు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



సైబర్ నేరగాళ్ల చేతిలో ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పిస్తున్నాం. బ్యాంకు నుంచి ఫోన్ చేశామని ఓటీపీ చెప్పాలంటూ కాల్స్ వస్తే స్పందించకూడదు. బ్యాంకు నుంచి అధికారులు ఫోన్లు చేయరు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి.

– యాదయ్యగౌడ్, సీఐ షాబాద్

కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యం

తలకొండపల్లి: కార్యకర్తల అభీష్టం మేరకే నడుచుకుంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నేత సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దేవకీ ఫంక్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ.. పార్టీలోకి నూతనంగా వచ్చిన వారికి కల్వకుర్తి కాంగ్రెస్ టికెట్ ఇవ్వరాదని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల అభిప్రాయాన్ని, సర్వేలను పరిగణలోకి తీసుకోవాలని.. కష్ట కాలంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి గ్రామగ్రామాన పార్టీ బలోపేతానికి కృషి చేసిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సేవలను పార్టీ అధిష్టానం గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయమే తనకు శిరోధార్యమని.. మీ అభిప్రాయాలకు అనుగుణంగా నడుచుకుంటానని తెలిపారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన నాయకులకు టికెట్ ఇస్తే.. గెలిచాక తిరిగి సొంత పార్టీల్లోకి వెళ్లకుండా ఉంటాడని నమ్మకమేంటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ఎన్ఎస్‌యూఐ యూత్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు అధికారం ఖాయం

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి

కల్వకుర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో, అటు కేంద్రంలో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాల్‌రాజ్, భాస్కర్‌రెడ్డి, రవినాయక్, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ తదితరులు ఉన్నారు.

'ఆరోగ్య మహిళ' సేవలు అభినందనీయం

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

నందిగామ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమం సేవలు అభినందనీయమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని పీహెచ్‌సీలలో ఆరోగ్య మహిళ ప్రోగ్రాం సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో ఆమె మాట్లాడారు. ఆరోగ్య సేవలు స్థానిక వైద్యులు ఏ విధంగా అందిస్తున్నారని రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సమయపాలన పాటిస్తున్నారా.. రోగులతో ఏ విధంగా వ్యవహరిస్తున్నారు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వారం కనీసం 60మంది మహిళలకు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కాగా మంగళవారం 62 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి 10 మంది రక్త నమూనాలు సేకరించి కొండాపూర్‌లోని ఆస్పత్రికి పంపించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ పి.నరహరి, స్థానిక డాక్టర్ తులసి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ రాజునాయక్, ల్యాబ్ టెక్నీషియన్ యాదగిరి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీ రికార్డు చేయొద్దని వినతి



పంచాయతీ రాజ్ ఏఈ ఆశాజ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న కాశీంబౌలి గ్రామస్తులు

మొయినాబాద్: దాతల ఆర్థిక సహకారంతో నిర్మించిన యూజీడీ పనులకు ఎంబీ రికార్డు చేయవద్దని కాశీంబౌలి గ్రామస్తులు పంచాయతీ రాజ్ ఏఈ ఆశాజ్యోతికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని కాశీంబౌలి గ్రామంలో యూజీడీ పనులు చేపట్టాలని గత నెల 21న పంచాయతీ పాలకవర్గం తీర్మాణం చేసి పనులను సుధాకర్‌రెడ్డికి అప్పగించారు. అతను పనులు చేయకపోవడంతో గ్రామస్తులు, వ్యవసాయ క్షేత్రాల యజమానులు నిధులు పోగు చేసుకుని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. దాతల సహకారంతో చేసిన పనులకు పంచాయతీ నిధులు డ్రా చేసేందుకు ఎంబీ చేయించే అవకాశం ఉందని.. ఎట్టి పరిస్థితుల్లో ఎంబీ రికార్డు చేయవద్దని ఏఈకి విన్నవించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహారెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, పెంటారెడ్డి, భూపాల్‌రెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, శశిధర్‌రెడ్డి, మహిపాల్ తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ భర్తపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కార్యాలయం ఎదట సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న అధికారులు, సిబ్బంది

తుర్కయంజాల్: శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు అతడిపై దాడికి యత్నించిన కౌన్సిలర్ భర్త గుండా ధన్‌రాజ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చట్టరీత్యా చర్యలు తీసుకోకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆదిబట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ బాల్‌రాజ్, నగేష్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.